ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 102 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 16 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole



GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM


# రామోజీరావు జీవితం మనందరికీ మార్గదర్శకం : చంద్రబాబు

**రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు.**



అమరావతి, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్): రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. విలువలతో కూడిన పాత్రికేయంతో, నిష్పక్షపాత వైఖరితో సమాజంపై తిరుగులేని ముద్ర వేసిన మహనీయుడని కొనియాడారు. వ్యాపారాల్లోనూ సమాజహితం, ప్రజా శ్రేయస్సు చూసిన ఏకైక వ్యాపారవేత్త అని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. తన సంస్థల ద్వారా సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన రామోజీరావును స్మరించుకోవడం ప్రజలందరి బాధ్యత అని, నిత్య స్ఫూర్తిగా నిలిచే ఆయన జీవితాన్ని మార్గదర్శిగా భావించి ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.రామోజీరావు స్ఫూర్తి ప్రదాత: లోకేశ్ రామోజీ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు జయంతి సందర్భంగా మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎనలేని సేవలందించిన రామోజీరావు.. స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. వ్యాపారంలోనూ సమాజ హితం కాంక్షించే ఆయన సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# ట్రంప్‌ను చంపే ఆలోచన మాకు లేదు : అమెరికాకు ఇరాన్ మెసేజ్

అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ను హత్య చేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ చెప్పింది. ఈ మేరకు అమెరికాకు సందేశం పంపింది.


**అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్పై వరుస హత్యాయత్నాలు తీవ్ర కలకలం రేపాయి. దీని వెనుక ఇరాన్ హస్తం ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు రావడంతో అగ్రరాజ్యం గట్టిగా హెచ్చరించింది. ఈ క్రమంలోనే టెహ్రాన్ స్పందిస్తూ..**



నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్): తమకు అలాంటి ఉద్దేశం లేదని చెప్పింది. ఈ మేరకు బైడెన్ సర్కారుకు సందేశం పంపినట్లు తాజాగా న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పై రెండు సార్లు హత్యాయత్నాలు జరిగాయి. దీంతో అప్పట్లో ఆయన ప్రచార బృందం ఓ ప్రకటన విడుదల చేసింది. "యూఎస్ లో అస్థిరత, గందరగోళాన్ని సృష్టించాలని ఇరాన్ ప్రయత్నిస్తుంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్నకు కచ్చితమైన ముప్పు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ కార్యాలయం హెచ్చరించింది" అని అందులో పేర్కొంది. ట్రంప్ హయాంలో 2020లో జరిగిన ఇరాన్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ హత్యకు ప్రతీకారంగానే టెహ్రాన్ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది సెప్టెంబరులో బైడెన్ ప్రభుత్వం టెహ్రాన్కు గట్టి హెచ్చరికలు చేసింది. ట్రంప్నకు హాని తలపెట్టాలని చూస్తే.. దాన్ని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనికి ఇరాన్ స్పందిస్తూ అక్టోబరులో తమ వివరణ పంపించినట్లు తాజా కథనం వెల్లడించింది. "సులేమానీ హత్య నేరపూరిత చర్యే. అయితే దీనిపై మేం అంతర్జాతీయ న్యాయ మార్గాల్లోనే పోరాటం చేస్తాం. అంతేగానీ, హింసాత్మక ఘటనతో ప్రతీకారం తీర్చుకోవాలనుకోవట్లేదు. ట్రంప్ను హత్య చేసే ఉద్దేశం మాకు లేదు" అని ఇరాన్ తమ సందేశంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మెసేజ్ను ఇరాన్ అధికారులు కూడా ధ్రువీకరించినట్లు సదరు కథనం తెలిపింది. దీనిపై అగ్రరాజ్య అధికారులు ఇంకా స్పందించనప్పటికీ.. టెహ్రాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నుంచే ఈ సందేశం వచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ను హత్య చేయాలన్న కుట్ర లో భాగస్వాములైన ఇద్దరు అమెరికా పౌరులను ఇటీవల ఎఫ్బీఐ అదుపులోకి తీసుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళానికి (ఐఆర్జీసీ) చెందిన ఓ అధికారి ఈ కుట్రలో కీలక పాత్ర పోషించాడని ఎఫ్బీఐ పేర్కొంది. ఐఆర్జీసీ అధికారి సూచనల ప్రకారమే ఇరాన్ ఉంటున్న ఫర్హాద్ షకేరీ.. అమెరికాలో తనకు తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఈ హత్య ప్రణాళికను అమలు చేసేందుకు ఎంపిక చేసుకున్నాడని పేర్కొంది. ఆ ఇద్దరిని కస్టడీలోకి తీసుకున్నామని ఎఫ్బీఐ తెలిపింది. ఎన్నికల ప్రచారం సందర్భంగానే ట్రంప్ను హత్య చేయాలని తమకు సూచనలు అందాయని, తర్వాత ప్రణాళిక మారిందని షకేరీ తెలిపినట్లు ఎఫ్బీఐ తెలపడం గమనార్హం.

# ఇక ఉగ్రవాదులు మనల్ని భయపెట్టలేరు: ప్రధాని మోదీ

ఉగ్రవాదులు ఇప్పుడు తమ సొంత గడ్డ పైనే భయంభయంగా బతుకుతున్నారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఇక వారు మనల్ని భయపెట్టలేరని అన్నారు.




నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్): గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పాలసీలు తీసుకొచ్చాయని ప్రధాని మోదీ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించామని పేర్కొన్నారు. శనివారం జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్షిప్ సదస్సులో ప్రధాని కీలక ప్రసంగం చేశారు. ఈసందర్భంగా ఉగ్రవాదం, తదితర అంశాలను ప్రస్తావించారు. సదస్సు ప్రాంగణంలో ప్రదర్శించిన 26/11 ముంబయి పేలుళ్ల కథనాలను మోదీ వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. "ఆ సమయంలో భారత ప్రజలు సురక్షితంగా లేరని చెప్పేందుకు కొందరు ఉగ్రవాదాన్ని ఉపయోగించేవారు. కానీ కాలం మారింది. ఇప్పుడు ఉగ్రవాదులు వారి సొంతగడ్డపైనే అభద్రతాభావంతో ఉంటున్నారు. భయంభయంగా బతుకుతున్నారు. ఇక, వారు మనల్ని భయపెట్టలేరు" అని మోదీ అన్నారు.ఈసందర్భంగా విపక్షాల పై మోదీ విమర్శల వర్షం కురిపించారు. "ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఎన్నికల తర్వాత ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ, ఈ దేశ ప్రజలు మమ్మల్ని నమ్మి మూడోసారి అవకాశమిచ్చారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాలసీలను తీసుకొచ్చాయి. ఆ పరిస్థితిని మేం పోగొట్టాం. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాం. మా విధానాలతో ప్రజలను ఆశావహ దృక్పథం వైపు నడిపిస్తున్నాం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే అనే మంత్రంతో మా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ప్రజల కోసం ఎక్కువగా ఖర్చు చేయాలి. ప్రజల కోసం ఎక్కువగా పొదుపు చేయాలనేదే మా విధానం" అని మోదీ వివరించారు.

## రన్ వేపై మోరాయించిన ట్రాక్టర్.. 40 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన ఇండిగో విమానం

**పట్నాలోని జయప్రకాశ్ నారాయణ విమానాశ్రయంలో ఇండిగో విమానం దాదాపు 40 నిమిషాల పాటు గాల్లో చక్కర్లు కొట్టింది.**



నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్): పట్నాలోని జయప్రకాశ్ నారాయణ విమానాశ్రయంలో ఇండిగో విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. రన్వేపై ట్రాక్టర్ మోరాయించడంతో (%ఒతీఖషేశీ తీ దీతీఖుఎం ఐశీఒఅ%) ల్యాండ్ అవ్వాల్సిన ఇండిగో విమానం దాదాపు 40 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్వేపై శుక్రవారం ఉదయం ట్రాక్టర్తో గడ్డి కోస్తుండగా అది మొరాయించింది.ట్రాక్టర్ బురదలో కూరుకుపోవడంతో దానిని అక్కడినుంచి క్లియర్ చేయడానికి సిబ్బంది 20 నిమిషాల పాటు శ్రమించారు. ఆ సమయంలో కోల్కతా నుంచి పట్నా వెళ్లే విమానం ల్యాండ్ కావాల్సిఉంది. అయితే రన్వేకు సమీపంలో ట్రాక్టర్ ఉండడంతో విమానం 40 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. దీనివల్ల ల్యాండింగ్ ఆలస్యమైంది. దీనిపై విమానాశ్రయం అధికారులు స్పందిస్తూ ప్రయాణికులకు కలిగిన ఆలస్యానికి, అసౌకర్యానికి క్షమాపణలు తెలియజేశారు.

# కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారు : విష్ణుకుమార్ రాజు

కేంద్ర ప్రభుత్వం గతంలో 7 లక్షల ఇళ్లు కేటాయించిందని భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు.



అమరావతి, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం గతంలో 7 లక్షల ఇళ్లు కేటాయించిందని భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. 5 లక్షల ఇళ్లకు పాలనా ఆమోదం కూడా ఇచ్చారని చెప్పారు. జగన్ దుర్మార్గంగా 2.3 లక్షల టిడ్కో ఇళ్లను వద్దని రద్దు చేశారని తెలిపారు. టిడ్కో ఇళ్లపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భగా విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం రాగానే కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపివేశారని చెప్పారు. కాంట్రాక్టర్గా తనకు రావాల్సిన బకాయే రూ.87 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. తన లాంటి వ్యక్తి పదిసార్లు ఆత్మహత్య చేసుకోవాలని.. గుండె ధైర్యం ఎక్కువ కాబట్టే ఆ పని చేయలేదని చెప్పారు. కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారని విమర్శించారు. బిల్లులు చెల్లించకపోయినా గుత్తేదారులు పని చేశారని వివరించారు. వైకాపా హయాంలో నిర్మాణాలు గాలికొదిలేసి పేదలను ఇబ్బంది పెట్టారని తెదేపా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. పేదవాళ్లు కట్టిన డిపాజిట్లు తిరిగి ఇవ్వలేదని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు లేవు.. డిపాజిట్లు తిరిగి రాలేదని దుయ్యబట్టారు.

# న్యాయం అడిగితే.. దాడులు చేస్తారా? : కేంద్ర మంత్రి బండి సంజయ్

ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ఐఐఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు.



హైదరాబాద్, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్): ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ఐఐఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ఐఐఐటీ విద్యార్థిని స్వాతిప్రియ కుటుంబానికి న్యాయం చేయాలని అడిగితే విచక్షణ రహితంగా దాడి చేయిస్తారా? అని ప్రశ్నించారు. బాసర ఐఐఐటీ పరిస్థితి రోజు-రోజుకూ దిగజారుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. "విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు. విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం హేయమైన చర్య. బాసర ఐఐఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. అరెస్టు చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలి. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం స్వాతిప్రియ అనే విద్యార్థిని బాసర ఐఐఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇవాళ ఆందోళన చేపట్టారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# గాడ్‌ఫాదర్ అండతో సివిల్ సప్లై స్టేట్ డైరెక్టర్‌గా పదవీ



## రేషన్ మాఫియాను అరికడుతా

## ఫ్యాక్షన్ రాజకీయాలతో పోరాడి రాటుదేలాను

## తెలుగుదేశం బీసిల పార్టీ

- సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో అవినీతి అంతు చూస్తా
- జగన్ స్వార్థంతోప్రభుత్వ వ్యవస్థలు నాశనం
- లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయడమే మా అజెండా
- రాజకీయాలలో బైరెడ్డి శబరి దారిలో నడుస్తా
- పాత్రికేయులకు అండగా నిలుస్తా

విద్యార్థి
ఉద్యమ నాయకుడు, శ్రీశైలం ముంపు బాధితులకు భరోసానిచ్చిన ఉద్యమకర్త, కరుడు గట్టిన ఫ్యాక్షన్ నేతలతో ఢీకొట్టి నిలిచిన బీసి నాయకుడు, రాజకీయాలలో రాజీ ఎరుగని రెబల్‌గా ముద్ర పడిన సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ మహేశ్వ-రనాయుడుతో రిపబ్లిక్ న్యూస్ ముఖాముఖి....

**రాజకీయాలలో రెబల్‌గా ముద్రపడి నిత్యం పోరాటాలలో మునిగితేలే మహేశ్వరనాయుడికి రాష్ట్రస్థాయి పదవి లభించడంలో ఎవరి ఆశీస్సులు ఉన్నాయి.....**

జిల్లాలో ఎవరి నుండి కూడా పదవి కోసం నేను రికమెండేషన్ లెటర్ అడుగలేదు. నాకు రాజకీయాలలో ఒక గాడ్‌ఫాదర్ ఉన్నాడు. గాడ్‌ఫాదర్ పేరు చెప్పడం నాకు ఇష్టం లేదు. ఆయన ఫోన్ చేసి పిలిచి ఈ పదవి ఖచ్చితంగా నీవు తీసుకోవాలి అని చెప్పడంతో బాధ్యతలు స్వీకరించాను.

**ఫ్యాక్షన్ లో రాష్ట్రంలోనే పేరుగాంచిన నందికొట్కూరు ప్రాంతంలో అగ్రకులాల ఆధిపత్యాల మధ్య ముచ్చుమర్రి పంచాయతీ మజారలోని వనములపాడు అనే కుగ్రామం నుండి బోయ కులానికి చెందిన మీరు బీసీ నేతగా రాజకీయాల్లో ఎదగడంలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు . . . .**

విద్యార్థినేతగా చురుకుగా ఉన్న నాకు మా ఊరిలో ఫ్యాక్షన్ నాయకుల అరాచకాలకు అడ్డు కట్ట వేయాలంటే కేవలం రాజకీయాల ద్వారానే సాధ్యమని నమ్మాను. దీంతో రాజకీయంగా కూడా మా గ్రామంలో ఎదుగుతుండటంతో ఎన్నో ఇబ్బందులకు మా కుటుంబాన్ని గురి చేశారు. నేను రేషన్ డీలర్‌గా ఉండటంతో గ్రామంలో రేషన్ తీసుకోరాదని హుకుం జారీ చేయడంతో పేదలకు ఉచితంగా రేషన్ పంపిణీ చేశాను. పొలాలను పండించిన తర్వాత పంటను కూడా కోయకుండా అడ్డుకోవడంతో కోర్టు ఉత్తర్వుల ద్వారా పోలీసు బందోబస్తు మధ్య పంటను తరలించే విపత్కర పరిస్థితిని ఎదుర్కొన్నాము. సార్వత్రిక ఎన్నికలలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటి చేసిన నేను నా ఓటును వేసుకోవడానికి కూడా భారీ ఎస్కార్టు పోలీసులతో మా గ్రామానికి వెళ్ళవలసి వచ్చింది. చివరికి కర్నూల్‌లో వచ్చి మా కుంటుంబం కాపురం పెట్టుకోవలసి వచ్చింది. అయిన మా కుటుంబంలో మా తండ్రి , మా సోదరులు,నా భార్య ఏనాడు భయపడలేదు.నా కుటుంబం ప్రోత్సాహంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ రాజకీయాలలో ముందుకు సాగాము. ఫ్యాక్షన్ రాజకీయాలతో పోరాడి రాటుదేలాను











**బైరెడ్డి కుటుంబంతో ఎదురొడ్డి సుదీర్ఘకాలం కొనసాగిన పోరాటానికి మీరు ముగింపు పలికి రాజీ అయ్యారా**

పూర్వంలో మా కుంటుంబ పెద్దలతో బైరెడ్డి కుటుంబానికి సాన్నిహిత్యం ఉండేది. శ్రీశైలం ముంపులో మా ఊరు మునిగిపోతే ప్రస్తుతం వనములపాడు గ్రామంకు బైరెడ్డి కుటుంబం సొంత పొలాన్ని ఇచ్చి సహకరించింది. ముచ్చుమర్రిలో మా కుటుంబానికి ఇంటి స్థలాన్ని కూడా కేటాయించడం జరిగింది. నేను కూడా శ్రీశైలం ముంపు బాధితులకు అండగా ఎన్నో పోరాటాలు నిర్వహించి నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించడంలో విజయం సాధించినాము. రాజకీయంగా కొన్ని విభేదాలు అప్పట్లో ఉండేవి. కానీ బైరెడ్డి శబరి నంద్యాల ఎంపిగా గెలిచి విదేశాలలో కూడా నంద్యాల కీర్తిని చాటుతూ మాకు రాజకీయాలలో ఆదర్శంగా నిలిచింది. బైరెడ్డి శబరి ప్రజలకు సేవ చేయాలన్న దారిలో నడుస్తుండటంతో అదే దారిలో రాజకీయంగా కూడా నేను వెళుతున్నాను.

**రేషన్ డీలర్ గా మీ గ్రామంలో మీకున్న అనుభవంతో సివిల్ సప్లై విభాగంలో ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ హెూదాతో రేషన్ దుకాణాలలో జరిగే అక్రమాలను మీరు ఎలా అరికట్టగలుగుతారు. . . .**

లక్షల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించే చౌక దుకాణాలలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా రేషన్ డీలర్‌గా చేసిన నాకు ఎటువంటి చర్యలు తీపుకోవాలన్నది బాగా తెలుసు. గతంలో కన్న చక్కెరను నాణ్యతతో అవినీతికి ఆస్కారం లేకుండా ప్యాకింగ్‌లో ఎక్కువగా అందిస్తున్నాము. ఇంకా కొన్ని మార్పులను తీసుకోవడానికి ప్రణాళికలు మా మంత్రి నాదెండ్ల మనోహర్ సిద్ధం చేస్తున్నారు.

**విద్యార్థి నేతగా మీకున్న అనుభవంతో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో, పాఠశాలలలో, అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు అందించే భోజనాలలో అవకతవకలు జరగకుండా మీ ప్రణాళికలు ఏమిటి . . .**

వైసీపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను జగన్ అవినీతితో నిర్వీర్యం చేసింది. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో, పాఠశాలలలో, అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు అందించే భోజనాలలో నాణ్యతలో ఎటువంటి అవకతవకలు జరుగకుండా విరివిగా తనిఖీలు నిర్వహిస్తాం. అవినీతికి పాల్పడితే గట్టి చర్యలు తీసుకుంటాం.

**సివిల్ సప్లై విభాగం ఆధ్వర్యంలోని గ్యాస్, పెట్రోల్ బంకులలో తనిఖీలు జరగడం అనేది మరిచినారు దీనిని మీరు ఎలా మారుస్తారు . . .**

దీపం పథకంతో మా కూటమి ప్రభుత్వం లక్షలాది నిరుపేద కుటుంబాలలో ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లను అందించి వెలుగులను తీసుకొని వచ్చింది. సివిల్ సప్లై ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్ బంకులలో ఇకపై తరుచుగా తనిఖీలు చేయడం ద్వారా ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటాము.

**రేషన్ బియ్యం తరలించే బియ్యం మాఫియాలో రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూల్,ళ నంద్యాల జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి ఈ మాఫియాను మీరు ఎలా అడ్డుకుంటారు . . .**

ప్రస్తుతం మా పార్టీలోనే కొందరు స్వార్థపరులు వారి స్వలాభం కోసం గతంలో వైసీపి నాయకులు నడిపిన రేషన్ మాఫియాకు సహకరిస్తున్నారని పార్టీకి కొంత సమాచారం కూడా వచ్చింది. రేషన్ మాఫియాపై మా మంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తూ ఉక్కుపాదం మోపారు. ఖచ్చితంగా మా ప్రభుత్వం రేషన్ మాఫియా విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకొని అంతం చేస్తుంది.

**రాయలసీమలో అత్యధిక జనాభాగా ఉన్న బీసీలలో ఇప్పటివరకు రాజకీయంగా బలమైన బీసీ నేత ఒక్కరు కూడా లేకపోవడానికి కారణాలు ఏమిటి . . .**

తెలుగుదేశం పార్టీ అంటేనే బీసిల పార్టీగా గుర్తింపు ఉంది. కర్నూల్ లో కెయి కుటుంబం ఉపముఖ్యమంత్రి పదవిని నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా బీసిలకు వన్నె తెచ్చారు.

**ఈనాడులో పాత్రికేయులుగా పనిచేసిన మీకు పాత్రికేయుల కష్టనష్టాలు తెలిసి ఉంటుంది బియ్యం మాఫియా అరాచకాలను వెలుగులోకి తెస్తున్న పాత్రికేయులపై దాడులు, కొందరు పోలీసులు పెడుతున్న దొంగ కేసులపై మీరు ఏం చెప్తారు.**

పాత్రికేయునిగా పని చేసిన నాకు పాత్రికేయుల కష్టనష్టాలు తెలుసు. రేషన్ మాఫియాకు సహకరిస్తే పోలీసులపై చర్యలు తీసుకుంటాం. పాత్రికేయులపై ఎటువంటి దాడులు జరిగిన వారిపై దొంగ కేసులు బనాయించిన నేను అండగా ఉండి పరిష్కరిస్తాను.

**రాజకీయంగా ఉన్నత పదవి పొందాలని మీకు లేదా ఎప్పుడు పై వారిని ప్రశ్నిస్తూ ఎదిరిస్తూ రెబెల్ గానే మిగిలిపోతారా . . .**

పదవి కోసం నేను ఎప్పుడు పోరాటాలు చేయలేదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎదిరించి ఉద్యమాలు చేశాను. పదవి వచ్చిందని పోరాటాలు, ఉద్యమాలు వీడను. నా సేవలు పదవి కోసం కాదు పార్టీ కోసం చేశాను. ఇప్పుడు నన్ను గుర్తించి రాష్ట్రస్థాయి పదవిని నాకు చంద్రబాబు, లోకేష్‌లు ఇచ్చి గౌరవించారు. ఇకపైమా యువ నాయకుడు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడమే అజెండాగా పని చేస్తాను.

స్టేట్ బ్యూరో ఎర్రం రాజశేఖర్ రెడ్డి


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# పెన్ను కోసం గొడవ

## .. భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

పల్నాడు జిల్లా నరసరావుపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెన్ను విషయంలో స్నేహితురాలితో ఏర్పడిన స్వల్ప వివాదం నేపథ్యంలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.



**నరసరావుపేట, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** పల్నాడు జిల్లా నరసరావుపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెన్ను విషయంలో స్నేహితురాలితో ఏర్పడిన స్వల్ప వివాదం నేపథ్యంలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన జెట్టి అనూష నరసరావుపేటలోని ప్రైవేటు కళాశాల హాస్టల్లో ఉ ంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం హాస్టల్లో ఉన్న సమయంలో స్నేహితురాలితో పెన్ను విషయంలో స్వల్ప వివాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అనూష హాస్టల్ భవనంలోని నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకేసింది. హాస్టల్ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కళాశాల యాజమాన్యం ద్వారా విషయం తెలుసుకున్న నరసరావుపేట ఆర్డీవో హేమలత, తహసీల్దార్ వేణుగోపాల్, నరసరావుపేట గ్రామీణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

# జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా తయారైందని వ్యాఖ్య

## .. రిప్లై ఇచ్చిన మంత్రి అచ్చెన్న

జీరో అవర్పై ఏపీ శాసనసభలో వాదోపవాదాలు జరిగాయి.



**అమరావతి, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** జీరో అవర్పై ఏపీ శాసనసభలో వాదోపవాదాలు జరిగాయి. జీరో అవర్ డ్రైవర్ లేని కారులా త-యారైందని తెదేపా ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సమస్యలను మంత్రులెవరు రాసుకుంటున్నారో తెలియడం లేదని ఆరోపించారు. దీంతో సమస్యలను తాను రాసుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిచ్చారు. పరిష్కరించిన తర్వాత సభ్యులకు సమాచారమిస్తామని చెప్పారు. మరోవైపు కూన రవి కుమార్ ఆఖరి వరుసలో కూర్చోవడం వల్ల ముందు జరిగేది తెలియడం లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చమక్కులు విసిరారు.

# ట్రోలర్ పై కఠిన చర్యలు తీసుకోండి

## : స్పీకర్కు ఎమ్మెల్యే వాసు విజ్ఞప్తి

రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిని సోషల్ మీడియాలో ట్రోల్ చేసి వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు.



**అమరావతి, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని సోషల్ మీడియాలో ట్రోల్ చేసి వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో శూన్యగంట సమ-యంలో స్పీకర్కు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో భవానీ అప్పట్లో మాట్లాడిన వ్యాఖ్యల్నే ట్రోల్ చేశారని, గత స్పీకర్కు విజ్ఞప్తి చేసినా.. స్పందించలేదన్నారు. ఇదే సమయంలో గత ఐదేళ్లలో దిశ చట్టం పేరిట జరిగిన దుర్వినియోగంపైనా విచారణ జరిపించాలని వాసు కోరారు.

# వేలేరుపాడు పోలీస్ స్టేషన్లో బోరుగడ్డ అనిల్ విచారణ

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కుటుంబంపై అసభ్య దూషణలు చేసిన వైకాపా నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ను పోలీసులు విచారిస్తున్నారు.



**ఏలూరు, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కుటుంబంపై అసభ్య దూషణలు చేసిన వైకాపా నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ను పోలీసులు విచారిస్తున్నారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వేలే-రుపాడు పోలీస్ స్టేషన్లో ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం వరకు విచారణ కొనసాగనుంది. రెండు నెలల క్రితం ఉద్దగిరి రాణి అనే మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అరెస్టయిన అనిల్ను విచారణ కోసం వేలేరుపాడు పోలీసులు కస్టడీకి కోరగా.. శు క్రవారం రాత్రి రాజమహేంద్రవరం జైలు నుంచి వేలేరుపాడుకు అతడిని తరలించారు.

# చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతి

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి.. రామ్మూర్తి నాయుడు



**హైదరాబాద్, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబునాయుడి సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి.. రామ్మూర్తి నాయుడు మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్ లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1994లో తెదేపా నుంచి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉ న్నారు. చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఏపీ మంత్రి నారా లోకేశ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకొని ఇవాళ ఉదయమే హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీ పర్యటనలో ఉ న్న చంద్రబాబు మరికాసేపట్లో తిరుగుపయనం కానున్నారు.సీఎం రేవంత్ రెడ్డి సంతాపం..మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# వైకాపా సోషల్ మీడియా

## కన్వీనర్, కో-కన్వీనర్లకు 41-ఏ నోటీసులు

వైఎస్ఆర్ జిల్లాలోని వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ వివేకానందరెడ్డి, కో-కన్వీనర్లు సునీత, నిశాంత్, వరకుమార్ లకు పోలీసులు 41-ఏ నోటీసులు ఇచ్చారు.



**కడప, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** వైఎస్ఆర్ జిల్లాలోని వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ వివేకానందరెడ్డి, కో-కన్వీనర్లు సునీత, నిశాంత్, వరకుమార్ల కు పోలీసులు 41-ఏ నోటీసులు ఇచ్చారు. వర్రా రవీంద్రరెడ్డి కేసులో విచారణకు శనివారం పులివెందుల పోలీస్ స్టేషన్కు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. దీంతో వారి ఇళ్లకు నోటీసులు అంటించిన పోలీసులు.. వారికోసం గాలింపు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు కీలక నేతలపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డి, సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్రెడ్డిలపై ఐటీ యాక్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

## విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణకు హాజరయ్యారు.



**హైదరాబాద్, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ ఆయన్ను విచారిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనకు ఇటీవల పోలీసులు నోటీసులు అందజేశారు. ఇప్పటికే ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు విచారించారు. ఇప్పటికే అరెస్ట్ అయిన నలుగురి చరవాణులను పోలీసులు విశ్లేషించారు. నిందితుల చరవాణుల్లో కాల్ డేటా ఆధారంగా రాజకీయ నేతలకు నోటీసులు ఇస్తున్నారు. జైపాల్ యాదవ్ స్టేట్మెంట్ను పోలీసులు రికార్డ్ చేయనున్నారు.

# రామోజీరావు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం: వెంకయ్యనాయుడు

విలువలతో కూడిన జర్నలిజానికి నిదర్శనంగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు.



**హైదరాబాద్, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** విలువలతో కూడిన జర్నలిజానికి నిదర్శనంగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అని మాజీ ఉ పరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. రామోజీరావు జయంతి సందర్భంగా నివాళు లర్పించారు. “అడుగు పెట్టిన ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మీడియా మొదలుకుని అనేక రంగాల్లో వారు వేసిన బాటలు నేటికీ ఆదర్శంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. వ్యక్తిగా మొదలై శక్తిమంతమైన వ్యవస్థగా ఎదిగిన రామోజీరావు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శ-నీయం” అని వెంకయ్యనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

# చంద్రబాబు సోదరుడు

## రామ్మూర్తినాయుడి ఆరోగ్య పరిస్థితి విషమం



ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడు రామ్మూర్తినాయుడు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.

**అమరావతి, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడు రామ్మూర్తి నాయుడుఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మంత్రి లోకేశ్ అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకొని హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. రామ్మూర్తి నాయుడు ప్రస్తుతం హైదరాబాద్లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు ఇవాళ సాయంత్రం 4.30 గంటలకు ఆస్పత్రికి చేరుకోనున్నారు.

# శంషాబాద్ ఎయిర్పోర్టులో విమానానికి బాంబు బెదిరింపు



**హైదరాబాద్, నవంబర్, 16 (రిపబ్లిక్ న్యూస్):** శంషాబాద్ విమానాశ్రయంలో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. హైదరాబాద్ నుంచి షార్జా వెళు _న్న విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఫ్లైట్లోకి వెళ్లాక బాంబు ఉందంటూ ఓ ప్రయాణికుడు కేకలు వేశాడు. అతడిని అదుపులోకి తీసుకుని విమానాశ్రయ సిబ్బంది తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1966 : జాతీయ పత్రికా దినోత్సవం
- 1890 : గొప్ప భాషా శాస్త్రవేత్త ఆదిరాజు వీరభద్రరావు జననం (మ.1973).
- 1908 : తెలుగు సినిమా దర్శకుడు మరియు నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి జననం (మ.1977).
- 1922 : ప్రముఖ జర్మన్ భౌతిక శాస్త్రవేత్త మాక్స్ అబ్రహామ్ మరణం (జ.1875).
- 1923 : ప్రసిద్ధ తెలుగు సినిమా నటుడు కాంతారావు జననం (మ.2009). (చిత్రంలో)
- 1963 : భారతీయ సినిమా నటి మీనాక్షి శేషాద్రి జననం.
- 1965 : రష్యా ప్రయోగించిన వీనస్-3 అంతరిక్ష నౌక శుక్రగ్రహం వైపు ప్రయాణం ప్రారంభించింది.
- 1973 : తెలుగు, తమిళ సినిమా నటి ఆమని జననం.
- 1973 : భారతదేశపు ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ జననం.


నరసింహారెడ్డి



జాతీయ పత్రికా దినోత్సవం


మాక్స్ అబ్రహామ్


వీనస్-3


ఆమని


పుల్లెల గోపీచంద్


కాంతారావు

## వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్ వేలంలో 13 ఏళ్ల ప్లేయర్


వైభవ్ సూర్యవంశీ.. ఇప్పుడీ పేరు పెను సంచలనంగా మారింది. ఐపీఎల్ మెగా వేలంలోకి వచ్చిన అతిపిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు.




దాదాపు 35 ఏళ్ల కిందట సచిన్ 16 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టాడనే వార్తలు విన్నాం. క్రికెట్ దిగ్గజం దాదాపు 24 ఏళ్లపాటు ఆటను శాసించాడు. ఆ తర్వాత ఆ స్థాయిలో సంచలనం ఎక్కడా నమోదు కాలేదు. తాజాగా ఐపీఎల్ మెగా వేలంలో ఓ ఆటగాడిని ఫ్రాంచైజీ దక్కించుకుంటే మాత్రం క్రికెట్లో మరో వండర్ క్రియేట్ అయినట్లే. ఇంతకీ ఏంటనేగా మీ సందేహం.. అదేంటో తెలియాలంటే ఇది చదివేయండి.. సాధారణంగా 13 ఏళ్ల వయసు కలిగిన పిల్లలు స్నేహితులతో ఆడుకుంటూ సరదాగా గడిపేస్తూ ఉంటారు. కానీ, బిహార్కు చెందిన వైభవ్ సూర్యవంశీ మాత్రం క్రికెట్టే ఊపిరి అంటూ ఒక్కో మెట్టు పైకి ఎదుగుతూ వస్తున్నాడు. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలంలో తన పేరును నమోదు చేసుకున్నాడు. స్టార్లుగా ఉన్న ప్లేయర్లే తమను తీసుకుంటారో లేదోననే సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మనకెందుకులే అనుకొని వేలానికి కూడా దూరంగా ఉండిపోయినవారూ లేకపోలేదు. చివరికి ఐపీఎల్ మేనేజ్మెంట్ వేలం షార్ట్ లిస్టు బయట పెట్టింది. అందులో వైభవ్ మాత్రం రూ.30 లక్షల బేస్ ప్రైస్తో తన పేరును ఎంట్రీ చేయించాడు. మరి అతడిని ఏ ఫ్రాంచైజీ తీసుకున్నా సంచలనమే కదా. దీంతో అతడు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాడు? ఎలా ఆడతాడు? అనే ప్రశ్నలు క్రికెట్ అభిమానుల్లో రావడం సహజమే కదా. బిహార్లోని తాజ్పుర్ గ్రామానికి చెందిన వైభవ్ సూర్యవంశీ 2011లో జన్మించాడు. నాలుగేళ్ల వయసులోనే బ్యాట్ను పట్టిన అతడి ఆసక్తిని చూసిన తండ్రి సంజీవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా మైదానాన్ని తయారు చేయించాడు. మరో నాలుగేళ్లకే సమస్తిపుర్లోని క్రికెట్ అకాడమీలో చేర్పించాడు. రెండేళ్లపాటు శిక్షణ పొందిన అతడు అండర్ -16 జట్టులోకి వచ్చేశాడు. అప్పటికి వైభవ్ వయసు కేవలం 10 ఏళ్లే కావడం గమనార్హం. ఎడమ చేతివాటం కలిగిన వైభవ్ బ్యాటింగ్, బౌలింగ్ లోనూ రాణించగలడు. 2024లోనే ఫస్ట్ క్లాస్ క్రికెట్లోకి అడుగుపెట్టిన వైభవ్ ఐదు మ్యాచ్లు ఆడాడు. ఓపెనర్ అయిన వైభవ్ దూకుడుగా ఆడటంలో నేర్పరి. ఫీల్డింగ్ సెటప్ను ఆసరాగా చేసుకొని బౌండరీలు బాదేస్తాడు.

## హొంబాలే ఫిల్మ్స్ మరో భారీ ప్రాజెక్ట్ .. 'మహావతార్ నరసింహ'

ప్రముఖ నిర్మాణ సంస్థ హొంబాలే ఫిల్మ్స్ మరో భారీ ప్రాజెక్ట్ చేపట్టింది. దానికి 'మహావతార్ నరసింహ' పేరును ప్రకటించింది.




'కేజీయఫ్', 'కాంతార', 'సలార్' తదితర చిత్రాలను ప్రేక్షకులను అందించిన ప్రముఖ నిర్మాణ సంస్థ హొంబాలే ఫిల్మ్స్మరో సరికొత్త ప్రాజెక్ట్ను పట్టాలెక్కించింది. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో 'మహావతార్: నరసింహ'ను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఫస్ట్లుక్ను విడుదల చేసింది. నటీనటులు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీ రానుంది. సామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అంతేకాదు, మహావతార్ సిరీస్లో రానున్న తొలి సినిమా ఇది. దీనికి కొనసాగింపుగా ఇతర అవతారాలతో సినిమాలు రాబోతున్నాయని చెప్పకనే చెప్పారు.ఇక హొంబాలే ఫిల్మ్స్ విషయానికొస్తే ఇప్పటికే విజయవంతమైన 'కాంతార', 'సలార్' ప్రపంచాలను కొనసాగిస్తూ కొత్త చిత్రాలు వస్తున్నాయి. భారీ బడ్జెట్తో రిషభ్శెట్టి కీలక పాత్రలో 'కాంతార: చాప్టర్1' ఇప్పటికే శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. తొలి భాగానికి ప్రీక్వెల్గా భారీ హంగులతో ఇది రూపుదిద్దుతోంది. మరోవైపు ప్రభాస్ కథానాయకుడిగా 'సలార్: శౌర్యంగ పర్వం' షూటింగ్ ఇటీవలే మొదలైంది. దీంతో పాటు, ప్రభాస్తో మరో రెండు సినిమాలను చేసేందుకు ఒప్పందం కూడా కుదిరింది."భారతీయ సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేలా మూడు చిత్రాల భాగస్వామ్యంలో ప్రభాస్తో కలిసి వర్క్ చేయడం ఆనందంగా ఉంది. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాటిక్ అనుభూతిని సృష్టించాలనే మా నిబద్ధతకు సంబంధించిన ప్రకటన ఇది. వేదిక సిద్ధమైంది. ముందుకుసాగే మార్గం అపరిమితంగా ఉంటుంది. తో ఈ ప్రయాణం ప్రారంభమవుతుంది. కాబట్టి సిద్ధంగా ఉండండి" అని తెలిపింది. 'ది హొంబలే ఈజ్ కాలింగ్ ప్రభాస్' అని పేర్కొంది. 2026, 2027, 2028ల్లో ఈ చిత్రాలు ఉండనున్నట్లు చెప్పింది. 'సలార్ 2' మినహాయించి మిగిలిన ప్రాజెక్టులు ఏమిటనే విషయాన్ని నిర్మాణ సంస్థ తెలియజేయలేదు.

## ఇదొక క్రాష్ కోర్సులా ఉంది : అల్లుఅర్జున్ కు శ్రీలీల సర్ప్రైజ్

అల్లు అర్జున్ నటిస్తోన్న 'పుష్ప ది రూల్ లో శ్రీలీల భాగమైన విషయం తెలిసిందే. ఇటీవల ఆమె షూట్లో కూడా పాల్గొన్నారు.



హుషారెత్తించే తన డ్యాన్స్తో యువ మనసులు గెలుచుకున్నారు నటి శ్రీలీల ప్రస్తుతం ఆమె 'పుష్ప ది రూల్ లో భాగమైన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో ఆమె 'కిస్సిక్' అనే ఐటమ్ సాంగ్ లో భాగమయ్యారు. ఇటీవల షూట్లో కూడా పాల్గొన్నారు. అల్లు అర్జున్తో వర్క్ చేయడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈమేరకు ఆయనకు సర్ప్రైజ్ గిఫ్ట్ పంపించారు. "టు బన్నీ సర్.. ప్రేమ, గౌరవంతో ఈ నోట్ మీకు పంపిస్తున్నాను. మీతో వర్క్ చేయడం నాకెంతో అందమైన అనుభూతిని పంచింది. నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే అనుభూతిని అందించినందుకు ధన్యవాదాలు. నిజం చెబుతున్నా ఈ ఐదారు రోజులు నాకు ఒక క్రాష్ కోర్సులా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే. మీకు, మీ కుటుంబానికి నా ప్రేమాభినందనలు" అని ఆమె రాసుకొచ్చారు. తగ్గేదేలే, శ్రీవల్లి, సామి, వైల్డ్ ఫైర్ వంటి హ్యాష్ ట్యాగ్స్ జత చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను అల్లు అర్జున్ ఇన్స్టా వేదికగా షేర్ చేశారు. "థ్యాంక్యూ మై డియర్. మీ మాటలు నా మనసుని తాకాయి.. నువ్వు మరెన్నో విజయాలు అందుకోవాలి" అని తెలిపారు. అంతేకాకుండా శ్రీలీలను డ్యాన్సింగ్ క్వీన్ అని పేర్కొన్నారు.%-%పుష్ప ది రైజ్కు కొనసాగింపుగా 'పుష్ప ది రూల్' రానుంది. సుకుమార్ దర్శకుడు. అల్లు అర్జున్ సం- ˇసన శ్రీవల్లిగా రష్మిక మరోసారి సందడి చేయనున్నారు. పార్ట్ 1లో కనిపించినకీలక పాత్రధారులు పార్ట్ 2లోనూ భాగమయ్యారు. ఎర్రచందనం స్మగ్లింగ్ సిండికేట్కు నాయకుడిగామారిన తర్వాత పుష్పరాజ్ ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నాడు? చుట్టుపక్కల గ్రామాల వారికిఏవిధంగా సాయం చేశాడు? అనే విషయాలను 'పుష్ప ది రూల్లో లో చూడొచ్చు. షూటింగ్ దాదాపుపూర్తైంది. ఇదే విషయాన్ని రష్మిక కూడా తెలియజేశారు. షూట్ ఎంతో సరదాగా గడిచిందని..టీమ్ను మిస్ కావడం బాధగా ఉందన్నారు. ఇందులో 'కిస్సిక్' అనే పాట కోసం శ్రీలీలనుతీసుకున్నారు. గణేశ్ ఆచార్య కంపోజ్ చేసినట్లు సమాచారం. తొలి చిత్రంలోని 'ఊ అంటావా...'కిదీటుగా ఇందులో 'కిస్సిక్...' పాట ఉంటుందని, శ్రీలీలతో కలిసి అల్లు అర్జున్ వేసిన డ్యాన్స్, ఆయనశ్వాగ్ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## ఇంటి చిట్కాలు

## సీతాఫలం ఆకుల్లో సూపర్ మ్యాటర్.. ఇలా వాడితే షుగర్, బీపీ కంట్రోల్ అవుతాయి..






సీతాఫలం ఇప్పుడు మార్కెట్లో ఎక్కువగా దొరుకుతుంది. ఈ పండును చాలా మంది ఇష్టంగా తింటుంటారు. సీతాఫలం తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయి. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ బి6, పొటాషియం, మెగ్నీషియం ఎన్నో ఖనిజాలు, పోషకాలు ఉన్నాయి. ఈ ఫలంలో ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇవి ఎన్నో రోగాల నివారణలో కీలక పాత్ర పోషిసాయి. అయితే, సీతాఫలం పండులోనే కాదు.. సీతాఫలం చెట్టు ఆకుల్లో కూడా బోలెడు పవర్ ఉంది. ఈ ఆకులో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఈ ఆకులు శరీరానికి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తాయి. అవి ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

### లివర్ ఆరోగ్యం..



సీతాఫల ఆకుల్లో లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే గుణాలు ఉన్నాయి. ఈ ఆకుల రసాన్ని తీసుకోవడం వల్ల లివర్ పనితీరు మెరుగుపడుతుంది. లివర్ సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. శరీరంలోని విషపూరితమైన టాక్సిన్లను బయటకు పంపడంలో సీతాఫలం ఆకులు బాగా పనిచేస్తాయి.

### షుగర్ కంట్రోల్..





సీతాఫలం ఆకులు డయాబెటిస్ పేషంట్లకు ఓ వరం అని చెప్పవచ్చు. ఈ ఆకులు రక్తంలో షుగర్ స్థాయిల్ని నియంత్రణలో ఉంచుతాయి. ఈ ఆకుల్ని నీటిలో మరగబెట్టి.. ఆ నీటిని తాగితే షుగర్ లెవల్స్ తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఇది ఇన్సులిన్గా పనిచేస్తుందని వారు చెబుతున్నారు.

### బీపీ తగ్గుతుంది..



ఈ రోజుల్లో చాలా మంది రక్తపోటుతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి సీతాఫలం ఆకులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ ఆకులో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. దీంతో బీపీ కంట్రోల్లో ఉంటుందని ఆయుర్వేద నిపుణులు వెల్లడిస్తున్నారు.

### చర్మ వ్యాధులు..



సీతాఫలం ఆకుల్లో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మ వ్యాధుల్ని తగ్గించడంలో సాయపడతాయి. ఈ ఆకును మెత్తగా పేస్టులా చేసి చర్మంపై అప్లై చేయాలి. మొటిమలు, ఎర్ర దద్దుర్లు, మంట, తామర వంటి లక్షణాల్ని ఈ పేస్టు అప్లై చేయడం వల్ల తగ్గుముఖం పడతాయి. చలికాలంలో ఈ పేస్టు ముఖానికి అప్లై చేసుకోవడం వల్ల చర్మం పొడిబారదు. ముఖం నిగనిగలాడుతుంది.

### గాయాలు..



సీతాఫలం ఆకులు యాంటీ సెప్టిక్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. దీంతో.. ఈ ఆకులు గాయాలు త్వరగా మానేందుకు సాయపడతాయి. ఈ ఆకుల్ని పేస్టులా చేసి గాయాలపై అప్లై చేస్తే అవి ఇన్ఫెక్షన్ బారిన పడవు. అంతేకాకుండా త్వరగా మానిపోతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు.

### దంత సమస్యలు..



సీతాఫలం ఆకుల్ని ఆయుర్వేదంలో దంత సమస్యలకు మంచి పరిష్కారమని చెబుతారు. దంతాలు ఇన్ఫెక్షన్లు, దంత క్షయం, బ్యాక్టీరియా వంటి వాటిని ఈ ఆకులు నయం చేస్తాయి. ఇందుకోసం సీతాఫలం ఆకుల్ని నమాలాలి. దీంతో.. దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోటి శుభ్రతను కూడా ఈ ఆకులు మెరుగుపరుస్తాయి.

### జీర్ణ సమస్యలు..

సీతాఫలం ఆకులు జీర్ణసమస్యల్ని తగ్గించడంలో సాయపడతాయి. ఈ ఆకుల్ని నీటి కాచి.. వడకట్టి తాగడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ట్రిక్ సమస్యలు, కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ ఆకుల నుంచి కాషాయం లేదా టీ చేసుకుని తాగితే కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు.



### ఈ ప్రయోజనాలు కూడా..



కీళ్ల నొప్పులు, వాపుల నివారణలో సీతాఫలం ఆకులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ ఆకుల్ని మెత్తగా నూరి పేస్టులా చేసి కీళ్ల నొప్పులు, వాపులు ఉన్న దగ్గర అప్లై చేయాలి. దీంతో.. కీళ్ల నొప్పులు, వాపులకు పరిష్కారం లభిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు వాపులు, మంటను తగ్గిస్తాయి. శరీరంలో విషపూరిత పదార్థాలను బయటకు పంపడంలో సీతాఫలం ఆకులు సమర్థవంతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక. ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.